




మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు | సంపుటి -1 | సంచిక -97 | పేజీలు-4 | గురువారం 9 ఏప్రిల్ 2026 | వెల4/-


## ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు

-- ట్రంప్ వ్యాఖ్యలు



అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ శాంతి గురించి ఆశాభావం వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ లో చేసిన పోస్టులో ప్రపంచంలో శాంతి నెలకొనే దిశగా సానుకూల పరిణామాలు కనిపిస్తున్నాయని తెలిపారు.

02

# రాష్ట్రపతి నుంచి సీఎం వరకు ఫిర్యాదులు.. గాలిలో







బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చెరుకూరు పంచాయతీపై తీవ్ర అవినీతి ఆరోపణలు... పీజీఆర్ఎస్ ఫిర్యాదులు మూసివేత... ఆర్టీఐకి సమాధానం లేదు... అధికారులు ఎందుకు భయపడుతున్నారు?

ఆర్టీఐకి కూడా సమాధానం లేదు...
చెరుకూరులో అవినీతి తుఫాన్
ప్రభుత్వం మౌనం ఎందుకు?
సీఎం జిల్లా పర్యటనలో చెరుకూరు పై స్పందించాలి...

ఎడిటర్ నరేంద్ర









### ఆర్టీఐకు సమాధానం ఎందుకు లేదు?

చెరుకూరులో అవినీతి ఆరోపణలపై ఒక మహిళ సమాచార హక్కు చట్టం కింద పంచాయతీ శాఖకు ఆర్టీఐ దాఖలు చేసింది. పంచాయతీ యాప్ ద్వారా రూ.2070 ఫీజు కూడాజూ చెల్లించింది. అయినప్పటికీ మూడు నెలలు గడిచినా ఇప్పటివరకు అధికారులు సమాచారం ఇవ్వలేదు.

సమాచార హక్కు చట్టం ప్రకారం నిర్ణీత సమయంలో సమాచారం ఇవ్వాలి. అయితే చెరుకూరులో మాత్రం ఆ చట్టాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆ మహిళ ఆరోపణ ప్రకారం చెరుకూరులో జరిగిన చర్యలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నందుకే అధికారులు సమాచారం ఇవ్వడానికి వెనుకడుగు వేస్తున్నారని అనుమానం వ్యక్తమవుతోంది.

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చెరు కూ రు పంచాయతీ ప్రస్తుతం అవినీతి ఆరోప ణలతో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీస్తోంది. గ్రామంలో జరుగుతున్న అక్రమాలపై వరుసగా ఫిర్యాదులు వెళ్లినా అధికార య ంత్రా ంగం నుంచి స్పందన లేకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తోంది. రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి వరకు ఫిర్యాదులు వెళ్లినప్పటికీ చర్యలు లేకపోవడం అను మానాలకు తావి స్తోంది. ఇదే సమ యంలో చెరు కూరుకు చెందిన ఒక మహిళ సమా చార హక్కు చట్టం కింద పంచా యతీ శాఖను ఆశ్రయించి వివరాలు కోరగా అధికారులు పంచాయతీ యాప్ ద్వారా రూ.2070 ఫీజు వసూలు చేసినప్పటికీ మూడు నెలలు గడిచినా ఇప్పటివరకు సమాచారం ఇవ్వకపోవడం పెద్ద వివాదానికి దారి తీసింది. సమాచారం ఇవ్వకపోవడం వెనుక ఏముంది? చెరుకూరులో ఏమి దాచిపెడుతున్నారు? అనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

**చెరుకూరు ప్రశ్న... ప్రభుత్వానికి పరీక్ష...**

- రాష్ట్రపతి, ప్రధాని వరకు వెళ్లిన ఫిర్యాదులు
- ముఖ్యమంత్రి దృష్టికి చేరిన చెరుకూరు అవినీతి
- పీజీఆర్ఎస్ ఫిర్యాదులుద విచారణ లేకుండానే మూసివేత
- ఆర్టీఐ ద్వారా వివరాలు అడిగిన మహిళకు సమాధానం లేదు
- పంచాయతీ యాప్ ద్వారా రూ.2070 వసూలు
- మూడు నెలలుగా సమాచారం ఇవ్వని అధికారులు
- చెరువుల ఆక్రమణలు, పన్నుల వసూళ్లపై వివాదం

చెరుకూరు
వివాదం ఎలా పెరిగింది?....
గ్రామంలో అభివృద్ధి పనులపై అవినీతి ఆరోపణలు
గ్రామస్తులు జిల్లా అధికారులకు ఫిర్యాదులు
పీజీఆర్ఎస్ ద్వారా అనేక ఫిర్యాదులు
రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి వరకు లేఖలు
ఆర్టీఐ ద్వారా వివరాలు కోరిన మహిళ
ఫీజు తీసుకున్నప్పటికీ సమాచారం ఇవ్వని అధికారులు

02

## వేమూరులో ముఖ్యమంత్రి పర్యటన



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేయనున్నారు.

అమరావతి రక్షణ న్యూస్

## సేంద్రియ వ్యవసాయమే భవిష్యత్

మారుటేరు కిసాన్ మేళాలో మంత్రి అచ్చెన్నాయుడు
డిమాండ్ ఆధారిత పంటల సాగుకు రైతులకు పిలుపు



పశ్చిమగోదావరి జిల్లా మారుటేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన కిసాన్ మేళాలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచెన్నెడు పాల్గొన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా తక్కువ వ్యయంతో అధిక లాభాలు సాధ్యమవుతాయని, రసాయనాల వినియోగాన్ని తగ్గించి భూమి సారాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని మంత్రి పేర్కొన్నారు.

మారుటేరు రక్షణ న్యూస్

# రహదారుల నిర్వహణ పటిష్టం చేయాలి

పాత్‌హోల్ ఫ్రీ
రహదారులు, ఎలక్ట్రిక్ బస్సుల వినియోగంపై ముఖ్యమంత్రి సమీక్ష



అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రహదారులు--భవనాలు, రవాణాశాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రహదారుల నిర్వహణ మెరుగుపరచడం, గుంతలులేని రహదారులు ఏర్పాటు చేయడం, ప్రజా రవాణాలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచడం వంటి అంశాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

అమరావతి,రక్షణ ప్రతినిధి:

## కష్టపడిన కార్యకర్తలకు లోకేష్ సత్కారం



మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో 'మై టీడీపీ యాప్'ను సమ-ర్థంగా వినియోగిస్తున్న ఉత్తమ కార్యకర్తలతో రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేష్ ఆత్మీయంగా భేటీ అయ్యా రు. రాష్ట్రవ్యాప్తంగా టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌ను సత్కరించి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

మంగళగిరి రక్షణ న్యూస్

## యువతా... భావజాలాన్ని గుడ్డిగా నమ్మొద్దు

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు
భావోద్వేగాలపై కాదు... వాస్తవాలపై ఆలోచించాలి
దేశ భవిష్యత్తుకు విద్యార్థులే దిశానిర్దేశకులు
ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ద చరిత్రకు ఘన కీర్తి



ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువతకు కీలక సందేశం ఇచ్చారు. ఏ భావజాలాన్నీ గుడ్డిగా నమ్మకూడదని, భావోద్వేగాల కంటే వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు నిర్మాణకర్తలని పేర్కొంటూ, తమ జ్ఞానం సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని పిలుపునిచ్చారు. శతాబ్ద చరిత్ర కలిగిన ఆంధ్ర యూనివర్సిటీ గొప్ప వారసత్వాన్ని కొనియాడారు

విశాఖపట్నం రక్షణ న్యూస్

రక్షణ

# ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు

మొదటి పేజీ తరువాయి

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ రాజకీయ పరిణామాలపై స్పందిస్తూ ఆశాజనక వ్యాఖ్యలు చేశారు. ట్రూత్ సోషల్ వేదికలో ఆయన చేసిన పోస్టులో ప్రపంచ శాంతి సాధ్యమవుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. ఇరాన్ కూడా శాంతిని కోరుకుంటోందని, ప్రపంచంలోని అనేక దేశాలు శాంతి దిశగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాయని పేర్కొన్నారు.ప్రత్యేకంగా పశ్చిమాసియా ప్రాంతంలో స్థిరత్వం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయని ట్రంప్ అన్నారు. ముఖ్యంగా స్ట్రైట్ అఫ్ హార్ముజ్ ప్రాంతంలో ఉన్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించడానికి అమెరికా సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ జలసంధి ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలక మార్గంగా ఉండటంతో అక్కడి పరిస్థితులు మెరుగుపడటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు.

ఇరాన్ ప్రస్తుతం పునర్నిర్మాణ దిశగా అడుగులు వేయగలదని కూడా ట్రంప్ పేర్కొన్నారు. అవసరమైన అన్ని రకాల సరఫరాలను పంపించేందుకు అమెరికా సహకరిస్తుందని, అక్కడి పరిస్థితులు సవ్యంగా కొనసాగుతున్నాయా అనే విషయాన్ని పర్యవేక్షిస్తామని తెలిపారు.

ప్రపంచంలో శాంతి నెలకొంటే అమెరికాలో ఉన్నట్లే పశ్చిమాసియాలో కూడా మంచి రోజులు వస్తాయని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే భవిష్యత్తులో శాంతి వాతావరణం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఏపీసీపీడీసీఎల్ నూతన కార్యాలయం ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

**అమరావతి రక్షణ న్యూస్**

అమరావతిలో నిర్మించిన ఏపీసీపీడీసీఎల్ నూతన కార్పొరేట్ కార్యాలయాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.30 కోట్లతో నిర్మించిన ఈ కార్యాలయం ఆధునిక సదుపాయాలతో ఏర్పాటుచేయబడింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలను సాధించే దిశగా విద్యుత్ శాఖ ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

విద్యుత్ శాఖకు మంచి పేరు రావడానికి ఉద్యోగుల నిరంతర కృషే కారణమని ఆయన తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయడం వల్లే ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందుతుందని అన్నారు.

వరదల వంటి విపత్కర పరిస్థితుల సమయంలో కూడా రాత్రి, పగలు అనే తేడా లేకుండా విద్యుత్ ఉద్యోగులు పనిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని మంత్రి కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా తక్కువ వోల్టేజి సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని చెప్పారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుతం రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని మంత్రి వెల్లడించారు. ప్రజలపై భారం పడకుండా విద్యుత్ చార్జీలు పెంచకుండా నిరంతరాయ విద్యుత్ అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, అదే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ శాఖ పనితీరుపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# వేమూరులో ముఖ్యమంత్రి పర్యటన

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, రక్షణ న్యూస్**



ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు గురువారం బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేలో అనేక తప్పులు చోటుచేసుకున్నాయని ప్రభుత్వం భావించడంతో వాటిని సరిచేసే చర్యలు చేపట్టింది. గతంలో పొలం హద్దుల కోసం పెట్టిన రాళ్లపైనా, రైతులకు ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలపైనా ఫోటోలు ముద్రించడం జరిగింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని ప్రక్షాళన చేస్తూ కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 16,816 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాల్సి ఉండగా ఇప్పటివరకు 6,976 గ్రామాల్లో సర్వే పూర్తి అయ్యింది. ఈ ఏడాది చివరి నాటికి రీ సర్వే పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఈ ఏడాది ప్రారంభం నుంచి రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోంది. జనవరి నెలలో 4,783 గ్రామాల్లో 18.77 లక్షల పాస్ పుస్తకాలు, ఫిబ్రవరిలో 279 గ్రామాల్లో 1,16,129 పాస్ పుస్తకాలు, మార్చిలో 299 గ్రామాల్లో 1,29,298 పాస్ పుస్తకాలను పంపిణీ చేసింది. మొత్తం జనవరి నుంచి ఇప్పటివరకు 5,717 గ్రామాల్లో 22.79 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేసింది.

మార్చి 2027 నాటికి 7,518 సిగ్నల్ గ్రామాల్లో 47,02,000 పాస్ పుస్తకాలు, ఏప్రిల్ 2027 నాటికి 2,438 నాన్ సిగ్నల్ గ్రామాల్లో 15,02,000 పాస్ పుస్తకాలను పంపిణీ చేయడానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. మొత్తంగా 9,956 గ్రామాల్లో 62,04,000 కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాల్సి ఉంది.

బాపట్ల జిల్లాలోని 8 మండలాల్లో 3,658 పాస్ పుస్తకాలు, వేమూరు నియోజకవర్గంలోని 1,795 పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పంపిణీ చేయనున్నారు. రైతులకు తెలియకుండా భూ రికార్డులు మార్పిడి జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. భూ రికార్డుల భద్రత కోసం ఆధునిక బ్లాక్‌చెయిన్ సాంకేతిక విధానాన్ని అమల్లోకి తీసుకువస్తోంది. దీని ద్వారా రికార్డులను ఎవరూ తారుమారు చేయడం అసాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు:**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదయం 10.50 గంటలకు భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామానికి చేరుకుంటారు. ఉదయం 11.00 గంటలకు అక్కడ నిర్వహించే ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 01.35 గంటలకు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 02.10 గంటలకు పార్టీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. కార్యక్రమం ముగిసిన తర్వాత సాయంత్రం 04.05 గంటలకు అమరావతికి తిరిగి చేరుకుంటారు.

# రాష్ట్రపతి నుంచి సీఎం వరకు ఫిర్యాదులు...గాలిలో..

మొదటి పేజీ తరువాయి

చెరుకూరు పంచాయతీపై వస్తున్న ఆరోపణలు ఇప్పుడు ఒక గ్రామ సమస్యను మించి రాష్ట్ర రాజకీయ వ్యవస్థను ప్రశ్నిస్తున్నాయి. గ్రామస్తులు వరుసగా ఫిర్యాదులు చేస్తూ ఉన్నారు. ఆధారాలు చూపుతున్నారని చెబుతున్నారు. అయినప్పటికీ అధికార వ్యవస్థ నుంచి స్పందన లేకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది.

ఒక గ్రామ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి రాష్ట్రపతి వరకు లేఖలు పంపాల్సి వస్తే అది వ్యవస్థ వైఫల్యమే కాకుండా ప్రజాస్వామ్యానికి హెచ్చరికగా భావించాలి.

చెరుకూరు ఒక గ్రేడ్ వన్ పంచాయతీ. జనాభా కూడా గణనీయంగా ఉంది. ఆదాయం కూడా ఉన్న పంచాయతీగా గుర్తింపు పొందింది. అయినప్పటికీ గ్రామంలో అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో లేవని గ్రామస్తులు చెబుతున్నారు.

ఈ పరిస్థితుల్లో గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులను ఆశ్రయించడం సహజం. కానీ చెరుకూరులో జరుగుతున్నది మాత్రం వేరే కథ చెబుతోంది.

గ్రామస్తుల ఆరోపణల ప్రకారం పీజీఆర్ఎస్ ద్వారా అనేక ఫిర్యాదులు నమోదు అయినప్పటికీ వాటిని విచారణ లేకుండానే మూసివేస్తున్నారని చెబుతున్నారు. ఇది నిజమైతే ప్రజల సమస్యలను వినడానికి ఏర్పాటు చేసిన వ్యవస్థనే నిర్వీర్యం చేసినట్టే.

ఈ వ్యవహారంలో అత్యంత కీలక అంశం ఆర్టీఐ వివాదం. ఒక మహిళ అవినీతి ఆరోపణలపై సమాచారాన్ని పొందేందుకు సమాచార హక్కు చట్టం కింద అభ్యర్థన పెట్టింది. అధికారులు పంచాయతీ యాప్ ద్వారా రూ.2070 ఫీజు కూడా వసూలు చేశారు.

కానీ మూడు నెలలు గడిచినా సమాచారం ఇవ్వలేదు.

ప్రశ్న ఒక్కటే ---

ఫీజు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

కానీ సమాచారం ఇవ్వడానికి ఎందుకు భయపడుతోంది?

సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన చట్టం. ప్రభుత్వ వ్యవహారాలు పారదర్శకంగా ఉండాలని ఆ చట్టం చెబుతుంది. కానీ చెరుకూరులో మాత్రం ఆ చట్టాన్ని పట్టించుకోకపోవడం తీవ్ర అనుమానాలకు దారి తీస్తోంది.

ఇక గ్రామంలో ఇతర సమస్యలు కూడా ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. చెరువుల ఆక్రమణలు, పన్నుల వసూళ్లు, మౌలిక సదుపాయాల లోపం వంటి అంశాలు గ్రామస్తులను తీవ్రంగా కలవరపెడుతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం మౌనం వహించడం మరింత అనుమానాలకు తావిస్తోంది.

ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు స్పష్టంగా ఉన్నాయి:

చెరుకూరులో ఏమి జరుగుతోంది?

ఎందుకు విచారణ జరగడం లేదు?

ఎందుకు ఆర్టీఐకి సమాధానం ఇవ్వడం లేదు?

ఎందుకు ఫిర్యాదులు మూసివేస్తున్నారు?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

చెరుకూరు వ్యవహారం ఇప్పుడు ఒక గ్రామ సమస్య కాదు. అది పారదర్శకత, బాధ్యత, ప్రజాస్వామ్యం గురించి లేవుతున్న ప్రశ్న.

ఇప్పుడు ప్రభుత్వం రెండు మార్గాల మధ్య నిలిచింది.

ఒకటి ---

మౌనం కొనసాగించడం.

రెండోది ---

సమగ్ర విచారణ చేపట్టి నిజాలను బయటకు తీసుకురావడం.

ప్రజాస్వామ్యంలో రెండో మార్గమే సరైనది.

చెరుకూరు ప్రజలు ఎదురుచూస్తున్నది ఒక్కటే ---

నిజం బయటకు రావాలి.

న్యాయం జరగాలి....

# రహదారుల నిర్వహణ పటిష్టం చేయాలి

మొదటి పేజీ తరువాయి

**అమరావతి,రక్షణ ప్రతినిధి:**

రాష్ట్రంలో రహదారుల నిర్వహణను మరింత పటిష్టంగా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో రహదారులు--భవనాలు మరియు రవాణాశాఖలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు.

రాష్ట్రంలో సుమారు 45 వేల కిలోమీటర్లకు పైగా రహదారులు ఉన్నాయని, వాటి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. రహదారులపై గుంతలు లేకుండా ఉండేలా పాత్‌హోల్ ఫ్రీ రోడ్ల లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు రహదారుల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.

రాష్ట్రంలోని ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు భిన్నంగా ఉన్నందున వాటిని అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం చేపట్టాలని సీఎం సూచించారు. వర్షపాతం, నేల స్వభావం, రవాణా అవసరాలు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని రహదారుల నిర్మాణ ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

మెరుగైన రహదారులు అభివృద్ధికి పునాది అని పేర్కొన్న ముఖ్యమంత్రి, మంచి రహదారులు ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. దీని వల్ల వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమల అభివృద్ధికి కూడా దోహదం అవుతుందని చెప్పారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడానికి రహదారుల అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థను ఆధునికంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు. ప్రజలకు తక్కువ వ్యయంతో ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన వ్యయం తగ్గించడంలో కూడా ఈవీ బస్సులు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు బి . సీ . జనార్ధన్ రెడ్డి , మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి , రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రహదారుల అభివృద్ధి, రవాణా వ్యవస్థ ఆధునీకరణపై తమ శాఖల ప్రగతిని ముఖ్యమంత్రికి వివరించారు.

**రాష్ట్రంలో 45 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్వహణపై సమీక్ష**

**గుంతలులేని పాత్‌హోల్ ఫ్రీ రహదారుల లక్ష్యం**

**భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి రహదారుల నిర్మాణం**

**ప్రజా రవాణాలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచాలని సూచనలు**

# కష్టపడిన కార్యకర్తలకు లోకేష్ సత్కారం

మొదటి పేజీ తరువాయి

**మంగళగిరి రక్షణ న్యూస్**

మంగళగిరి: కష్టపడిన వారిని గుర్తించడం తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య మరియు సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 'మై టీడీపీ యాప్'ను సమర్థంగా వినియోగిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌తో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఆత్మీయ భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ప్రతి కార్యకర్తను ఆప్యాయంగా పలకరించిన మంత్రి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఒక వ్యవస్థ అని, అందరూ ఆ వ్యవస్థలో భాగమని తెలిపారు. కార్యకర్తల పనితీరు వల్లే వారు ఈ స్థాయికి చేరుకున్నారని చెప్పారు. రేపు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పక్కన కూర్చొనే స్థాయికి కార్యకర్తలు ఎదగాలని సూచించారు.

పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ శతాబ్దం పాటు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమని గుర్తించాలన్నారు. పార్టీలో సంస్కరణలు తీసుకురావడానికి తాను కృషి చేస్తున్నానని, కార్యకర్తలే పార్టీకి అసలు అధినేతలని అన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు నుంచి క్లస్టర్ ఇన్‌చార్జి, పొలిట్‌బ్యూరో స్థాయి వరకు ఎదగగల అవకాశాలు కార్యకర్తలకు ఉండాలని మంత్రి పేర్కొన్నారు.

ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీ సిద్ధాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు. కడప మహానాడులో ఆమోదించిన ఆరు శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించేందుకు సంవత్సరంలో 365 రోజులూ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గత ప్రభుత్వ కాలంలో ఎమ్మెల్యేలను కూడా కలవలేదని విమర్శిస్తూ, ప్రస్తుతం మాత్రం కార్యకర్తలతో నేరుగా సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా కార్యకర్తలతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకుంటున్నామని తెలిపారు. వారంలో ఒకరోజు పార్టీ కార్యాలయంలో కార్యకర్తలను కలుసుకుని వారి సమస్యలు తెలుసుకునే కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తున్నామని వివరించారు.

పార్టీ కోసం ప్రాణాలు అర్పించిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు చట్ట సవరణ కూడా చేశామని మంత్రి తెలిపారు. కార్యక్రమం అనంతరం ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించి. ఎన్ టీ . రామ రావు జ్ఞాపికను మంత్రి నారా లోకేష్ బహూకరించారు. మంత్రి లోకేష్‌తో ఆత్మీయంగా భేటీ కావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని 'మై టీడీపీ యాప్' ఉత్తమ కార్యకర్తలు తెలిపారు.

# సేంద్రియ వ్యవసాయమే భవిష్యత్

మొదటి పేజీ తరువాయి

**మారుటేరు రక్షణ న్యూస్**

పశ్చిమగోదావరి జిల్లా మారుటేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం నిర్వహించిన "కిసాన్ మేళా -- మారుతున్న వాతావరణ పరిస్థితులు, సుస్థిర వరి వ్యవసాయం" కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రంలోని ప్రయోగశాలలను పరిశీలించి శాస్త్రవేత్తలతో మాట్లాడారు. ఆధునిక వరి వంగడాలపై వివరాలు తెలుసుకుని అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూమి నాణ్యత దెబ్బతింటోందని, రైతుల ఖర్చులు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. భూమి సారాన్ని కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలంటే సేంద్రియ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

రైతులు మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు చేయాలని మంత్రి సూచించారు. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని చెప్పారు. ఏ ప్రాంతంలో ఏ పంటలు అనుకూలమో వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. ట్రాక్టర్లు, డ్రోన్లు, ఇతర వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్నందున రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కాలువల ఆధునీకరణపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులను వేగంగా పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు.మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలను అభినందించారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పక్క వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సన్మాన్ నిధి పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు భూసార పరీక్షలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మారుటేరు పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఆర్. శారదా జయలక్ష్మి దేవి, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ధనుంజయరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తదితరులు పాల్గొన్నారు. రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

9–4–26 rakshana main_Layout 1 4/9/2026 6:59 AM Page 3



# టిడిపి సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యం

### పార్టీ నేతల తీరుపై లోకేశ్ అసహనం
### పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సన్మానం
### మంగళగిరి టిడిపి కార్యాలయంలో లోకేశ్



**అమరావతి,ఏప్రిల్8(:** కొందరు పార్టీ నేతల తీరుపై మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర అసమనం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎలా అంటూ ఆగ్రహం కూడా వ్యక్తపరచారు. కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ వరుసగా నాలుగు వారాలు నిర్వహించని పలువురు నాయకులను నారా లోకేశ్ మందలించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే

మాధవి రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి వరుసగా నాలుగు వారాలు కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ నిర్వహించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలు నిర్వహించకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని పార్టీ కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నారా లోకేశ్ బుధవారం టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ నేతలపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు వారాల నుంచి కేడర్ సమావేశాలు నిర్వహించని పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, నాలుగు వారాల నుంచి గ్రీవెన్స్ నిర్వహించని ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పట్ల నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు కచ్చితంగా నిర్వహించాలని లోకేశ్ హుకుం జారీ చేశారు. ఇకముందు ఇలానే వ్యవహారిస్తే ఉపేక్షించేది లేదని లోకేశ్ స్పష్టం చేశారు. కష్టపడిన వారిని గుర్తించాలనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. నేతల పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణమని చెప్పారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుందని తెలిపారు. 'మై టీడీపీ యాప్' టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ అయ్యారు. పార్టీ సిద్దాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. యాప్ సమర్ధ వినియోగం పట్ల ఉత్తమ కార్యకర్తలను లోకేశ్ ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని లోకేశ్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు. 'మై టీడీపీ యాప్' టాప్-10 ఫెర్మార్మర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మై టీడీపీ యాప్' సమర్ధ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మీ పని తీరే ఇక్కడి వరకు రావడానికి కారణమంటూ కొనియాడారు. ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడాలని, టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు.

# హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

### తమిళనాడు జాలర్ల దుందుడుకు చర్యలను ఆపండి
### సిఎం చంద్రబాబుకు బిజెపి అధ్యక్షుడు మాధవ్ లేఖ

**అమరావతి,ఏప్రిల్8(** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం హోం గార్డులు.. విధి నిర్వహాణలో భాగంగా పోస్టింగ్ కారణంగా తమ సొంత ఊళ్లకు దూరంగా ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో చాలా మంది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సేవలందిస్తుండగా.. వారి కుటుంబాలు తెలంగాణలో నివసిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 200 మంది హోంగార్డులు ప్రస్తుతం ఏపీలో పని చేస్తున్నారని వివరించారు. అందువల్ల వారు తీవ్ర వ్యక్తిగత, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనితోపాటు నైతిక స్థైర్యాన్ని సైతం వారు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేయాలని సిఎంను కోరారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీర ప్రాంతంలోకి తమిళనాడుకు చెందిన జాలర్లు బోట్లు ద్వారా చొచ్చుకొచ్చి స్థానికులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ రెండు సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ లేఖ ద్వారా తీసుకెళ్లారు. ఈ లేఖను ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ బుధవారం అమరావతిలో విడుదల చేశారు. పరస్పర ప్రాతిపదికన రాష్ట్రాల మధ్య బదిలీకి వీలు కల్పించడం ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హోం గార్డుల సమస్యలను పరిష్కరించడంలో సహాయపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.దే విధంగా పొరుగున ఉన్న తమిళనాడులోని కడలూరు, కారేకల్‌కు చెందిన జాలర్లు ఆంధప్రదేశ్‌లోని నెల్లూరు, ఒంగోలు, బాపట్ల ప్రాంతాలకు వచ్చి స్థానిక మత్స్యకారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ లేఖలో సీఎం చంద్రబాబుకు మాధవ్ వివరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఇప్పటికే పలు సంఘటనలు అక్కడ జరిగాయని తెలిపారు. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు స్పీడు బోట్లతో ఆంధ్ర తీర ప్రాంతంలో మత్స్య సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. ఏడాది మార్చిలో నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతంలో అక్రమంగా సంచరిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్న తమిళనాడు జాలర్ల బోట్లను అక్కడ స్థానికులు నిర్బంధించారని పీవీఎన్ మాధవ్ గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు స్థానిక అధికారుల తోడ్పాడుతో ఆ బోట్లను రాత్రికి రాత్రే విడుదల చేశారని చెప్పారు. తమిళనాడుకు చెందిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అక్రమంగా ఆంధ్ర తీర ప్రాంతంలో సంచరిస్తూ స్థానికులను భయ భ్రాంతులకు గురి చేస్తున్న తమిళనాడు జాలర్లపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు పీవీఎన్ మాధవ్ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# ప్రజాదర్బార్‌లో సమస్యలపై వినతి

### ఓపికగా విని పరిష్కారానికి లోకేశ్ హామీ

**గుంటూరు,ఏప్రిల్8**ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజాదర్బార్'ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో 87వ రోజు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధప్రదేశ్ వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించారు. సాధారణ ప్రజలే కాకుండా టీడీపీ కార్యకర్తలు, నేతలు సైతం తమ సమస్యలను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంతో ఓపికగా వారి సమస్యలు విని వినతులు స్వీకరించారు మంత్రి లోకేశ్. ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పాటుపైనా మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు అందింది. సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పాటు సందర్భంగా విజయవాడలోని లోకో పైలట్ల గాలా డిపోను తరలించకుండా చూడాలని మంత్రికి సిబ్బంది విజ్ఞప్తి చేశారు. కోవిడ్ వల్ల నష్టపోయిన హైర్ బస్ యజమానుల బస్సులకు రీప్లేస్మెంట్ కల్పించి ఆదుకోవాలని యజమానులు కోరారు. వంశపారంపర్యంగా సంక్రమించిన తమ 2.63 ఎకరాల భూమిని ఆక్రమించారని మంత్రి లోకేశ్‌కు కర్నూలు జిల్లా గుండంపాడుకు చెందిన ఎస్.చిన్న శివమ్మ ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారించి తమ భూమిని తిరిగిచ్చేలా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అందరి సమస్యలను ఓపిగ్గా విన్న మంత్రి లోకేశ్ వారి నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా లోకేశ్ ట్వీట్ చేశారు.

# శ్రీపురం రేషన్ దుకాణంలో అక్రమాలు బహిర్గతం డీలర్‌పై 6ఏ కేసు నమోదు

**దక్కిలి, (ఏప్రిల్ 8)తిరుపతి జిల్లా దక్కిలి**

మండలంలోని శ్రీపురం గ్రామంలో పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పిడిఎస్) అమలులో లోపాలు వెలుగుచూశాయి. బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో రేషన్ దుకాణం--2లో గణనీయమైన అక్రమాలు బయటపడ్డాయి. ప్రజలకు సరఫరా చేయాల్సిన బియ్యంలో తేడాలు ఉండటమే కాకుండా, వినియోగదారులకు తెలియజేయాల్సిన కీలక సమాచారాన్ని దాచిపెట్టడం గమనార్హమైంది.తనిఖీల సందర్భంగా రికార్డుల్లో చూపిన నిల్వలతో పోల్చితే 15 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇది నిబంధనలకు విరుద్ధమని తేల్చారు. అదేవిధంగా రేషన్ దుకాణంలో తప్పనిసరిగా ప్రదర్శించాల్సిన ధరల పట్టికను ఏర్పాటు చేయకపోవడం కూడా బయటపడింది. ఈ రెండు అంశాలు ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించడమేనని తహసీల్దార్ శ్రీనివాసులు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో సంబంధిత డీలర్‌పై 6ఏ కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని తహసీల్దార్ శ్రీనివాసులు వెల్లడించారు. ప్రజలకు న్యాయంగా సరఫరా అందేలా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అండగా నిలవాల్సిన రేషన్ వ్యవస్థలో ఇలాంటి అక్రమాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. అధికారులు చేపడుతున్న ఆకస్మిక తనిఖీలు అక్రమాలకు చెక్ పెట్టడంలో కీలకంగా మారుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఇకపై ఇలాంటి ఉల్లంఘనలు ఎక్కడైనా గుర్తించినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ స్పష్టం చేస్తున్నాయి.

# మార్కెట్ డైరెక్టర్ మాధవరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





**రేణిగుంట ఏప్రిల్ 08**

రేణిగుంట మండలం తిమ్మయ్య గుంట గ్రామంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుదీర్ సుధీర్ రెడ్డి పర్యటించారు. శ్రీకాళహస్తి మార్కెట్ డైరెక్టర్ మాధవరెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో, ఆయనను పరామర్శించేందుకు ఎమ్మెల్యే స్వయంగా మాధవరెడ్డి నివాసానికి చేరుకున్నారు. మాధవరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, పార్టీ పరంగాను వ్యక్తిగతంగాను అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెట్ చైర్మన్ చెంచయ్య నాయుడు, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ భాష, కరకంబాడి క్లస్టర్ ఇంచార్జ్ టీడీపీ సీనియర్ నాయకులు బుజ్జి రెడ్డి పాల్గొన్నారు. అలాగే అన్నాస్వామి పల్లి టీడీపీ సీనియర్ నాయకులు ముచ్చెలి భాస్కర్ రెడ్డి, అన్నాస్వామి పల్లి గ్రామ కమిటీ సీనియర్ నాయకులు కాపీ రెడ్డి నాదమునిరెడ్డి, వెంకట మునిరెడ్డి, చెంచయ్య, చంద్రయ్య యాదవ్, జనార్దన్ రెడ్డి, రాజేంద్ర, చెంగల్ రాయలు, వీరేంద్ర రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకటాపురం చందు తదితరులు పాల్గొన్నారు. రేణిగుంట మండల పట్టణ అధ్యక్షులతో పాటు పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ పరామర్శ కార్యక్రమంలో పాల్గొని మాధవరెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధిలోనూ, పార్టీ బలోపేతంలోనూ చురుగ్గా వ్యవహరించే నాయకులకు అండగా ఉండడం తన బాధ్యతని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# మామండూరు రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం

**రేణిగుంట ఏప్రిల్ 08**

రేణిగుంట మండలం పరిధిలోని కోడూరు రేణిగుంట ప్రధాన రహదారిపై మామండూరు గ్రామం సమీపంలో 08-04-2026 తెల్లవారుజామున సుమారు 02:00 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం సంభవించింది. మహారాష్ట్ర రాష్ట్రం, షోలాపూర్ జిల్లా, ఘెరాడి మండలం, మెటకరవడి గ్రామానికి చెందిన విజయ్ బాలు కోకెర (వయస్సు 25 సం), లారీ నం. ఎం హెచ్ 46 హెచ్ 7659 డ్రైవర్‌గా పని చేస్తూ, అహ్మదాబాద్ నుండి చెన్నై పోర్టుకు మెడికల్ పరికరాలు తీసుకెళ్తుండగా, అదే లారీలో క్లీనర్‌గా శుభం కాకా సాహెబ్ జుజారే (వయస్సు 21 సంవత్సరాలు) ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో రేణిగుంట వైపు నుండి కోడూరు వైపు వస్తున్న లారీ నం. ఏపీ 39 టీ టీ 1137 డ్రైవర్ చోటు యాదవ్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడుపుతూ, ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయడానికి కుడివైపుకు వచ్చి, ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రెండు లారీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. లారీ క్లీనర్ శుభం కాకా సాహెబ్ జుజారేకు పెదవుల వద్ద, కుడి కాలు మరియు కుడి చేతికి గాయాలు కాగా, మరొక లారీ డ్రైవర్ చోటు యాదవ్‌కూ కుడి కాలుకు గాయం అయ్యింది. గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా తిరుపతిలోని రుయా ఆసుపత్రిలోకు తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై తగు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేణిగుంట పోలీసులు తెలిపారు.

# యువతా... భావజాలాన్ని గుడ్డిగా నమ్మొద్దు:

మొదటి పేజీ తరువాయి

**విశాఖపట్నం రక్షణ న్యూస్**

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల భాగంగా నిర్వహించిన మెగా కల్చరల్ ఫెస్ట్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువతను ఉద్దేశించి భావప్రదమైన ప్రసంగం చేశారు.

యువత ఏ ఒక్క భావజాలాన్నీ గుడ్డిగా నమ్మవద్దని స్పష్టం చేస్తూ, ప్రతి సిద్ధాంతాన్ని సమగ్రంగా విశ్లేషించి, అది ప్రస్తుత కాలానికి అనుకూలమా కాదా అన్నది పునరాలోచించాలని సూచించారు. భావోద్వేగాలకు లోనవకుండా, తర్కం మరియు వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

విద్య అనేది కేవలం పుస్తకాల జ్ఞానం మాత్రమే కాదని, అది సమాజ సమస్యలను పరిష్కరించే శక్తి అని పేర్కొన్నారు. యువతలో అపారమైన శక్తి దాగి ఉందని, దాన్ని సమాజాభివృద్ధి కోసం వినియోగించాలన్నారు. "మీ ఆలోచనలు పరిష్కారాలుగా మారాలి, మీ కృషి సమాజానికి మేలు చేసే మార్పుగా మారాలి" అని సూచించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం గురించి మాట్లాడుతూ, ఇది కేవలం విద్యాసంస్థ మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, మేధస్సు, దేశ నిర్మాణానికి ప్రతీకగా నిలిచిందన్నారు. 1926లో స్థాపించబడిన ఈ విశ్వవిద్యాలయం శతాబ్ద కాలంగా వేలాది మంది మేధావులను సమాజానికి అందించిందని కొనియాడారు.

మహనీయులు కేట్టమంచి రామలింగ రెడ్డి , సర్వేపల్లి రాధాకృష్ణన్ , సీ . వి . రమణ వంటి వ్యక్తుల సేవలను గుర్తు చేశారు.

దేశం ప్రస్తుతం నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచ శక్తిగా ఎదుగుతోందని, రాష్ట్రం కూడా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి దిశగా సాగుతోందన్నారు.

యువతలో న్యూక్లియర్ శక్తిలాంటి సామర్థ్యం ఉందని, వారు కోరుకుంటే సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలరని అన్నారు. ప్రతి విద్యార్థి బాధ్యతగల పౌరుడిగా ఎదిగి దేశ నిర్మాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

# ఏపీసీపీడీసీఎల్ నూతన కార్యాలయం ప్రారంభం

**అమరావతిలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) నూతన కార్పొరేట్ కార్యాలయాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. సుమారు రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ కార్యాలయం విద్యుత్ శాఖ పరిపాలనా వ్యవస్థకు మరింత బలం చేకూర్చనుందని మంత్రి తెలిపారు.**






**అమరావతి రక్షణ న్యూస్**

అమరావతిలో నిర్మించిన ఏపీసీపీడీసీఎల్ నూతన కార్పొరేట్ కార్యాలయాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.30 కోట్లతో నిర్మించిన ఈ కార్యాలయం ఆధునిక సదుపాయాలతో ఏర్పాటుచేయబడింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలను సాధించే దిశగా విద్యుత్ శాఖ ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.విద్యుత్ శాఖకు మంచి పేరు రావడానికి ఉద్యోగుల నిరంతర కృషే కారణమని ఆయన తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయడం వల్లే ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందుతుందని అన్నారు.వరదల వంటి విపత్కర పరిస్థితుల సమయంలో కూడా రాత్రి, పగలు అనే తేడా లేకుండా విద్యుత్ ఉద్యోగులు పనిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని మంత్రి కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా తక్కువ వోల్టేజి సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని చెప్పారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుతం రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని మంత్రి వెల్లడించారు. ప్రజలపై భారం పడకుండా విద్యుత్ చార్జీలు పెంచకుండా నిరంతరాయ విద్యుత్ అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, అదే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ శాఖ పనితీరుపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# పశ్చిమాసియాలో కాల్పుల విరమణ

### స్వాగతించిన భారత విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ,ఏప్రిల్8** ఇరాన్-అమెరికాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణను భారత్ స్వాగతించింది. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి కోసం ఉద్రిక్తతలను తగ్గించాలి, చర్చలు, దౌత్యం కోసం పిలుపునివ్వాలని సూచించింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాల్పుల విమరణను మేము స్వాగతిస్తున్నాము. ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారితీస్తుందని ఆశిస్తున్నాము. మేము గతంలో, నిరంతరం స్పష్టం చేసినట్లుగా.. కొనసాగుతున్న సంఘర్షణలకు త్వరగా ముగింపు పలకడానికి ఉద్రిక్తతలను తగ్గించడం, చర్చలు, దౌత్యం చాలా అవసరం అని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ సంఘర్షణలతో ఇప్పటికే ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రపంచ ఇంధర సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగించింది. హార్ముజ్ జలసంధి నుండి నిరాటంకమైన నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ వాణిజ్య ప్రవాహం కొనసాగుతుందని మేము ఆశిస్తున్నామని తెలిపింది.


# బిజెపి చెప్పుచేతల్లో ఎన్నికల సంఘం

### ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్8:** భారత ఎన్నికల సంఘం బిజెపి కింద పనిచేస్తోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ ఇసిపై తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం ఉదయం తృణమూల్ కాంగ్రెస్ బృందం భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ని కలిసి.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎన్నికలు భయరహితంగా, హింసారహితంగా, బెదిరింపులు, ప్రలోభాలు, దాడులు లేకుండా జరపాలని కోరింది. అయితే ఇసికి, టిఎంసి బృందానికి మధ్య ఏడు నిమిషాల పాటు సమావేశం జరిగింది. ఈ చర్చల్లో తాము చెప్పినవి వినకుండా ఇసి చీఫ్ జ్ఞానేశ్ కుమార్ ఇక్కడి నుంచి వెళ్లిపోండి అని అవమానించినట్లుగా టిఎంసి బృందం వెల్లడించింది. టిఎంసి బృందానికి జరిగిన అవమానంపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ స్పందించారు. ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలం. బిజెపి చెప్పినట్టే పనిచేస్తుంది. బిజెపి నుంచి నేరుగా అందే ఆదేశాలను ఇసి తీసుకుంటుంటోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ విషయం ఇప్పుడు బహిరంగమైంది. ఇది అత్యంత దురదృష్టకరం అని కేజ్రీవాల్ ఎక్స్ పోస్టులో ఇసిని విమర్శించారు.

9-4-26 rakshana main_Layout 1 4/9/2026 6:59 AM Page 4





# అల్లు అర్జున్ మూవీ పేరు రాకా !

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ అందింది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ చేయబోతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'రాకా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపిస్తున్నారు. గుండుతో, కళ్లకు కాటుక పెట్టుకుని, ఒంటిపై వింత ఆకృతులతో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఆయన ఏదో 'వేర్-బీస్ట్' (జంతువుగా మారే మనిషి) తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఆమె ఈ చిత్రంలో ఒక వీరనారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక ÷ఎఈచీ హంగులతో రూపొందుతోంది. హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం సహా 7 భాషల్లో 2027 వేసవిలో విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. 'విజన్ బియాండ్ లిమిట్స్' హద్దులు లేని ఊహ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్టీఆర్, నీల్ మూవీ షూటింగ్ రద్దు ర్యూమర్స్

## వదంతులను తోసిపుచ్చిన చిత్ర బృందం

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. ఈ సినిమా షూటింగ్ రద్దు అయిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ లుక్ విషయంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో షూటింగ్ వాయిదా వేశారని టాక్ వినిపించింది. తాజాగా ఈ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'సినిమాలో హీరో లుక్, దీని షెడ్యూల్ రద్దు అంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఈ సినిమా షూటింగ్ ప్లాన్ ప్రకారమే ముందుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రిపరేషన్ గ్యాప్ తీసుకున్నారంతే. దయచేసి ఎవరూ ఈ ప్రాజెక్ట్‌పై రూమర్స్ సృష్టించొద్దు. అనధికారిక సమాచారాన్ని షేర్ చేయొద్దు. ఏమైనా మార్పులు ఉంటే మేమే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.



# పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న బైకర్




టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'బైకర్' బాక్సాఫీస్ వద్ద అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా, విడుదలైన ఐదు రోజుల్లోనే ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచే స్థాయిలో వసూళ్లు రాబడుతోంది. సాధారణంగా ఏ సినిమా అయినా వీక్‌డేస్‌లో కలెక్షన్లు తగ్గుముఖం పడతాయి. కానీ 'బైకర్' విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. రోజు రోజుకూ ఈ సినిమా పుంజుకుంటూ ముందుకు దూసుకెళ్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ మౌత్ టాక్ ఈ చిత్రానికి పెద్ద ప్లస్‌గా మారింది. ఆన్‌లైన్ బుకింగ్స్ కూడా ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. సోమవారం రోజు బుక్‌మైషోలో సుమారు 15.6 వేల టిక్కెట్లు అమ్ముడవ్వగా, మంగళవారం ఈ సంఖ్య 17.2 వేలకు పెరగడం విశేషం. భారీ పోటీ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ స్పోర్ట్స్ డ్రామాపై చూపిస్తున్న ఆసక్తి సినిమా విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని దర్శకుడు అభిలాష్ రెడ్డి కంకర తెరకెక్కించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించింది. సినిమాలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించగా, సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. అలాగే అతుల్ కుల్కర్ణి కూడా తన నటనతో ఆకట్టుకున్నారు. ఇక సంగీత దర్శకుడు జిబ్రాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ సినిమాకు మరింత బలం చేకూర్చింది. ముఖ్యంగా రేసింగ్ సీక్వెన్స్‌లలో ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెడుతోందని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. కొత్త కాన్సెప్ట్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎలిమెంట్స్ కలగలిపిన 'బైకర్' ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటూ బాక్సాఫీస్ వద్ద విజయపథంలో దూసుకుపోతోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా మరింత భారీ వసూళ్లు సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# రాశీ ఖన్నా స్టన్నింగ్ లుక్

టాలీవుడ్ 'ఊహలు గుసగుసలాడే' భామ రాశీ ఖన్నా తన అందచందాలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సినిమాల్లో హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా తన గ్లామర్‌తో కుర్రకారును కట్టిపడేస్తోంది. తాజాగా గ్రీన్ కలర్ మోడరన్ డ్రెస్సులో బ్యాక్ ఓపెన్ ఫోజులతో ఇంటర్నెట్‌కు సెగలు పుట్టించింది. అందం, అభినయం ఉన్నా అదృష్టం ఊరించని ఈ ఢిల్లీ బ్యూటీ, ప్రస్తుతం తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో నెట్టింట వైరల్ అవుతోంది. రాశీ ఖన్నా స్టన్నింగ్ లుక్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఆ విశేషాలు చూద్దాం.. ఇక సినిమా అవకాశాల సంగతి పక్కన పెడితే, సోషల్ మీడియాలో మాత్రం రాశీ ఖన్నా ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉంటుంది. తాజాగా గ్రీన్ కలర్ డ్రెస్‌లో అదిరిపోయే ఫోజులిచ్చింది. బ్యాక్ ఓపెన్ ఫోటోలతో గ్లామర్ గేట్లు ఎత్తేసి యూత్‌ను మైకంలో ముంచెత్తుతోంది. మోడరన్ లుక్‌లో రాశీ ఇచ్చిన గమ్మత్తైన ఫోజులు ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. తన అందంతో మళ్ళీ ఫామ్‌లోకి రావాలని, దర్శక నిర్మాతల కళ్లలో పడాలని రాశీ గట్టిగానే ప్రయత్నిస్తోంది. ఈ రేంజ్ గ్లామర్ ట్రీట్ చూశాకైనా మళ్ళీ అవకాశాలు క్యూ కడతాయని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ప్రస్తుతం రాశీ ఖన్నా చేతిలో కొన్ని ప్రాజెక్టులు ఉన్నాయి. హిట్లు లేకపోయినా తన ఫాలోయింగ్‌ను మాత్రం పదిలంగా కాపాడుకుంటోంది. టాలీవుడ్ మేకర్స్ కూడా ఈ భామకు మరో అవకాశం ఇస్తే ఖచ్చితంగా ప్రూవ్ చేసుకుంటుందని అభిమానులు నమ్ముతున్నారు. వరుస ఫొటోషూట్‌లతో నిత్యం వార్తల్లో నిలుస్తూ తన ఉనికిని చాటుకుంటోంది. రానున్న రోజుల్లో వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుని, బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని రాశీ ఖన్నా భావిస్తోంది. ఇక ఈ క్రేజీ బ్యూటీకి ఒక సరైన మాస్ కమర్షియల్ హిట్ పడితే మళ్ళీ స్టార్ హీరోయిన్ల రేసులోకి రావడం ఖాయం.

